సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 30 । ఆగస్టు । 2023



చీనీ టన్ను రూ.20వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి. మార్కెట్‌కు 196 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.20 పలికింది. కనిష్టంగా రూ.6.50, సరాసరిన రూ.13 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.


గరిష్టం/కనిష్టం

37.8°/ 22.3°

జిల్లాలో మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత, గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

వారికొద్దండి బాబూ..!

- టికెట్లపై 'తమ్ముళ్ల' నిరసన గళం
- జేసీ సోదరులను ప్రోత్సహించవద్దని అధిష్టానానికి ఫిర్యాదులు
- పరిటాల కుటుంబంలో ఒక్కరికి టికెటిచ్చినా ఓడిపోతాం
- జిల్లా అధ్యక్షులుగా కాదు నియోజకవర్గానికీ పనికిరారు
- నాయకుల కంటే వర్గాలే ఎక్కువని కార్యకర్తల్లో ఆందోళన
- ఎస్సీ నియోజకవర్గాల్లో కనీస గుర్తింపు ఇవ్వడం లేదన్న విమర్శలు
- అవినీతిపరులైన కందికుంట, పల్లెకు టికెట్లు వద్దంటున్న కేడర్
- టీడీపీలో గందరగోళ పరిస్థితులు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఎన్నికలు సమీపిస్తున్న వేళ తెలుగుదేశం పార్టీలో గందరగోళం నెలకొంది. ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లుగా ఉన్న నాయకులపై కార్యకర్తలు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు. వీళ్లకు టికెట్లిస్తే వచ్చే ఎన్నికల్లో మునిగిపోతాం అంటూ బహిరంగంగానే చెబుతున్నారు. నాయకుల కంటే వర్గాలు ఎక్కువయ్యాయని, ఈ నాయకుల కొట్లాటలతో పిచ్చెక్కిపోతోందని వాపోతున్నారు. మరోవైపు టీడీపీ నాయకులు ఇప్పటి వరకూ ఏం చేశామో చెప్పలేక.. భవిష్యత్‌లో ఏం చేయగలమో తెలియక ప్రజల్లోకి వెళ్లడం మానేశారు. అధికార పక్షమే ప్రతిపక్ష పార్టీ పాత్ర పోషిస్తోంది. కనీవినీ ఎరుగని రీతిలో దేశ చరిత్రలో తొలిసారి ప్రతి గడపకూ వెళుతున్న పార్టీగా వైఎస్సార్‌సీపీ రికార్డు సృష్టించింది. కుల, మత, వర్గాలకతీతంగా 86 శాతం మందికి పైగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో సంక్షేమ ఫలాలు అందించిన ఘనతను సాధించింది.

వాళ్లను ప్రోత్సహిస్తే పుట్టి మునుగుతుంది

వాహనాలకు నకిలీ పత్రాలు సృష్టించి అమ్మి ఈడీ కేసులో ఇరుక్కోవడంతో పాటు తాడిపత్రిలో నిత్యం వివాదాలు సృష్టిస్తున్న జేసీ సోదరుల (దివాకర్ రెడ్డి- ప్రభాకర్‌రెడ్డి)ను ప్రోత్సహించవద్దని జిల్లా నుంచి పలువురు టీడీపీ అధిష్టానానికి ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. వారిని ప్రోత్సహిస్తే పార్టీకి నష్టం కలుగుతుందని టీడీపీ నాయకులే చెబుతున్నారు. జేసీ సోదరుల చౌకబారు ఎత్తుగడలకు పార్టీ అథఃపాతాళానికి దిగజారిందని వాపోతున్నారు.

- పరిటాల రవి కుటుంబం పైనా అనేక ఆరోపణలు ఉన్నాయి. పరిటాల రవి హయాంలో ఆర్‌టీసీ పేరిట జరిగిన దమనకాండ చెరగని మచ్చ అని..పైగా పరిటాల సునీత నాడు మంత్రిగా ఉండి చేసిందేమీ లేదని, ఈ కుటుంబానికి రెండు టికెట్లు కాదు ఒక్కరికి టికెట్ ఇచ్చినా మునిగిపోవడం ఖాయమని పలువురు అంటున్నారు.

వీళ్లేమి జిల్లా అధ్యక్షులు బాబూ..!

జిల్లాల పునర్విభజన తర్వాత అనంతపురానికి కాలవ శ్రీనివాసులు, శ్రీసత్యసాయికి బీకే పార్థసారథి టీడీపీ జిల్లా అధ్యక్షులుగా అయ్యారు. వీళ్లపై రోజురోజుకూ వ్యతిరేకత పెరుగుతోంది. జిల్లాలో కాలువ శ్రీనివాసులు ఎవరినీ కలుపుకుపోవడం లేదని, పైగా రాయదుర్గంలో ఆయన గెలవలేని పరిస్థితి ఉందని కొంతమంది కార్యకర్తలు అంటున్నారు. ఇటీవల చంద్రబాబు అనంతపురం వచ్చినప్పుడు బాగా గుర్తింపు ఉన్న ఓ కార్యకర్తను 'చస్తే చావు' అంటూ అన్న మాటలు అక్కడున్న వారిని తీవ్ర మనస్తాపానికి గురిచేశాయి. పైగా మూడేళ్లు మంత్రిగా ఉండి ఏమీ చేయలేదని ఆరోపణలున్నాయి. దీంతో పాటు బీకే పార్థసారథి ఇంట గెలవలేక రచ్చ రచ్చ చేస్తున్నారని, ఆయనకు జిల్లా మొత్తం ఎలా అప్పగిస్తారని ప్రశ్నిస్తున్నారు. ప్రతి రోజూ బీసీ సామాజికవర్గానికి చెందిన సవితమ్మతో పోరు కొనసాగిస్తూ పెనుకొండ నియోజకవర్గానికే పరిమితమయ్యారన్న చెడ్డపేరు ఉంది. జిల్లా అధ్యక్షులుగానే కాదు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లుగానూ వీరు పనికి రారన్న విమర్శలు గుప్పిస్తున్నారు.

అవినీతి ఆరోపణలతో ఉక్కిరిబిక్కిరి

కదిరిలో ఇప్పటికే కందికుంట వెంకట ప్రసాద్ కుటుంబానికి టీడీపీ టికెట్ ఇవ్వవద్దని మరో వర్గం పోరాడుతోంది. పుట్టపర్తిలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిపై అవినీతి ఆరోపణలున్నాయని, ఆయనకు గనుక టికెట్ కేటాయిస్తే ఓటమి తథ్యమని కొందరు కుండ బద్దలుకొడుతున్నారు. గుంతకల్లులో టీడీపీకి అభ్యర్థి ఉన్నారనే విషయమే ఎవరికీ తెలియదని, కళ్యాణదుర్గంలో రెండు వర్గాలు కొట్టుకుంటూ ఉంటే పరువు బజారున పడుతోందని, అసలు అనంతపురం జిల్లా వైపు అధిష్టానం ఎప్పుడైనా చూస్తోందా అంటూ కిందిస్థాయి కేడర్ మండిపడుతోంది.

దళిత నేతలకు గుర్తింపు ఏదీ?

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉన్న రెండు ఎస్సీ నియోజకవర్గాల్లో టీడీపీ దళిత నేతలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. రెండు నియోజవర్గాల్లోనూ ఆధిపత్య కులాల నాయకులదే పెత్తనం. శింగనమలలో బండారు శ్రావణిని పట్టించుకునే దిక్కు లేదు. స్వయానా ఆమె తండ్రిపై టీడీపీ వారే దాడి చేస్తే (లోకేష్ పాదయాత్ర సమయంలో) జిల్లాలో ఉండికూడా పరామర్శించలేదు. ఇక మడకశిరలో టీడీపీ అభ్యర్థి ఎవరో ఇప్పటికీ తెలియదు. మైనింగ్ అవినీతిలో కూరుకుపోయిన గుండుమల తిప్పేస్వామి కనుసన్నల్లో ఆ నియోజకవర్గం ఉంది. దీంతో జిల్లాలో రోజురోజుకూ పార్టీ పరిస్థితి దిగజారిపోతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అత్యాచార కేసులో ముద్దాయికి జీవిత ఖైదు

అనంతపురం: కూతురిపై అత్యాచారం చేసి సభ్య సమాజం తలదించుకునేలా ప్రవర్తించిన ఓ తండ్రికి జీవిత ఖైదు శిక్ష పడింది. ఈ మేరకు అనంతపురం పోక్సో కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి మంగళవారం సంచలన తీర్పు వెలువరించారు. కేసు పూర్వాపరాల్లోకెళ్తే... కదిరి పట్టణానికి చెందిన తలుపుల బాబ్జాన్ మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో ఉన్నపుడు విచక్షణ కోల్పోయేవాడు. తన భార్య ఇంట్లో లేని సమయంలో 14 ఏళ్ల కుమార్తెను లైంగికంగా వేధించాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించాడు. చివరకు ఆరోగ్యం క్షీణించిన బాలిక పాఠశాలకు వెళ్లినపుడు కళ్లు తిరిగి పడిపోయింది. ఉపాధ్యాయులు డాక్టర్‌తో చూపించగా.. గర్భిణి అని నిర్ధారించారు. దీనికి కారణమైన తండ్రిపై సదరు బాలిక 2018 నవంబర్ 26న పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. 376 (ఎఫ్), 342, 506, ఐపీసీ, సెక్షన్ 5(జే), (2) (ఎన్), 6 ఆఫ్ పోక్సో యాక్ట్ కింద నిందితుడిపై కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ శ్రీలక్ష్మి కేసు దర్యాప్తు పూర్తి చేసి, చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టులో ప్రత్యేక ప్రాసిక్యూటర్ కసనూరు విద్యాపతి బాధితురాలి పక్షాన 13 మంది సాక్షులను విచారణ చేశారు. కేసు పూర్వాపరాలు, ఇరువర్గాల వాదనల అనంతరం ముద్దాయి తలుపుల బాబ్జాన్‌పై నేరం రుజువైంది. ముద్దాయికి జీవిత కాలం జైలు శిక్ష, సెక్షన్ 506 ఐపీసీ కింద రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి మంగళవారం తీర్పు చెప్పారు. బాధితురాలికి రూ.4 లక్షలు పరిహారంగా అందించాలని ప్రభుత్వానికి సిఫార్సు చేశారు.

పవర్‌లూమ్స్‌పై అధికారుల దాడులు

ధర్మవరం: పట్టణంలోని పలు పవర్‌లూమ్స్ మగ్గాలపై అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. శివానగర్‌లో ప్రభాకర్, సిద్దయ్య గుట్టలో గుర్రం రామాంజనేయులు, పార్థసారథి నగర్‌లో మంజు పవర్‌లూమ్స్‌ను తనిఖీ చేశారు. చేనేత రకాలు తయారు చేస్తున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ రాజారావు మాట్లాడుతూ 11 రకాల చేనేత రకాలు తయారుచేస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ఏడాదిన్నర నుంచి దాదాపు 90 కేసులు నమోదు చేశామన్నారు. ధర్మవరంలో కార్యాలయం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. చేనేత కార్మికులకు పని లేకపోతే తమకు సమాచారం అందించాలని, పని కల్పిస్తామని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రమేష్, మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పవర్‌లూమ్స్ చీరలను పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

'విశ్వకర్మ'పై విస్తృత అవగాహన

- వృత్తి కళాకారులకు లబ్ధి చేకూర్చాలి
- పరిశ్రమల స్థాపనకు గడువులోపు అనుమతులివ్వాలి
- కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం

పుట్టపర్తి అర్బన్: సంప్రదాయ చేతివృత్తిదారులు, హస్తకళాకారుల కోసం అమలు చేస్తున్న 'ప్రధాన మంత్రి విశ్వకర్మ' పథకంపై విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. పరిశ్రమల స్థాపనకు సంబంధించిన అనుమతులు గడువులోగా మంజూరు చేయాలన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన పారిశ్రామికవేత్తలకు రుణసదుపాయం కల్పించాలన్నారు. కేటాయించిన ప్లాట్లలో పరిశ్రమలు ఏర్పాటయ్యేలా చూడాలన్నారు. సింగిల్ డెస్క్ పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న 6 పరిశ్రమలకు సంబంధించి అనుమతులు మంజూరు చేయాలని తీర్మానించారు. జిల్లాలో 15 చిన్న, మధ్య, సూక్ష్మ తరహా పరిశ్రమలకు సంబంధించి వడ్డీ సబ్సిడీ మంజూరు చేయాలన్నారు. చిలమత్తూరు వద్ద స్థాపించనున్న చెర్రీస్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ వద్ద అప్రోచ్ రోడ్ నిర్మాణానికి 1.26 ఎకరాల ప్రభుత్వ భూమి మంజూరు చేయాలని ఆదేశించారు. 18 సంవత్సరాలు దాటి చేతి వృత్తులు నేర్చుకోవాలనుకునే ఆసక్తి కలిగిన వారందరికీ ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని వర్తింపజేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం రమణకుమార్, పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌ఎం బాషా, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోని, ఏపీఎస్‌ఎఫ్‌సీ అధికారి వెంకట్‌మహేష్, 'పుడా' చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, ఐపీఓలు నాగార్జున, రామాంజనేయరెడ్డి, కేవీ రమణ, సత్య చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పారదర్శకంగా విచారణ

ఇంటింటి సర్వేలో వచ్చిన దరఖాస్తులపై అత్యంత పారదర్శకంగా విచారణ చేపట్టాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో జేసీ చేతన్, సబ్ కలెక్టర్ కార్తీక్‌తో కలిసి ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేకాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా విచారణ చేయాలన్నారు. బీఎల్‌ఓల పనితీరుపై పర్యవేక్షణ పెంచాలని సూచించారు. తొలగించిన ఓట్లు, వాటి ధ్రువపత్రాలను నిశితంగా పరిశీలించాలన్నారు. మృతులు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి బంధువుల నుంచి ధ్రువపత్రాలు స్వీకరించాలన్నారు. ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ సమయానికి ఇంటి నంబర్, ఓటరు వయస్సు, ఒకే ఇంటి నంబర్‌లో 10 మందికి మించి ఓటర్లు ఉంటే సరి చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల అధికారులు భాగ్యరేఖ, రాఘవేంద్ర, తిప్పేనాయక్, చిన్నయ్య, ఎన్నికల డీటీలు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

చిరస్మరణీయుడు గిడుగు రామ్మూర్తి

- కలెక్టర్ అరుణ్‌బాబు



గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: భాషోద్యమానికి మూల పురుషుడు, బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘసంస్కర్తగా పేరుగాంచిన గిడుగు రామ్మూర్తి పంతులు చిరస్మరణీయులని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని 'స్పందన' సమావేశ మందిరంలో మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి ఆయన ఘన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ రచయితగా తెలుగు, ప్రతిభ, జనవాణి పత్రికలను నెలకొల్పి తెలుగు సాహిత్యానికి గిడుగు రామ్మూర్తి వన్నె తెచ్చారని కొనియాడారు. జేసీ చేతన్ మాట్లాడుతూ గిడుగు జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వం ఈనెల 23 నుంచి 29 వరకూ తెలుగు భాషా చైతన్య వారోత్సవాలు నిర్వహిస్తోందన్నారు. పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డీఆర్‌ఓ కొండయ్య, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఈఓ మీనాక్షి తదితరులు ఉన్నారు.

పోలీసు కుటుంబాలకు ప్రభుత్వ అండ



రణధీర్ కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి

పుట్టపర్తి టౌన్: పోలీసుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల చిత్తూరు జిల్లా పుంగనూరులో ప్రతిపక్ష నేత చంద్రబాబు నిర్వహించిన బస్సు యాత్ర కారణంగా గొడవలు చెలరేగి కానిస్టేబుల్ రణధీర్ గాయపడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కానిస్టేబుల్ కుటుంబానికి ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి రూ.10 లక్షలు విడుదలైంది. చెక్కును మంగళవారం అనంతపురంలోని తన కార్యాలయంలో రణధీర్ కుటుంబ సభ్యులకు డీఐజీ అమ్మిరెడ్డి అందజేశారు. రణధీర్ కుటుంబాన్ని ఆదుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. కానిస్టేబుల్ రణధీర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, డీఐజీకి, ఎస్పీ మాధవ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, తోటి ఉద్యోగిని ఆదుకోవాలనే సదుద్దేశంతో పోలీసులు తమ వంతుగా రూ.1.5 లక్షల చెక్కును ఎస్పీ మాధవరెడ్డి చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఆర్ ఎస్‌ఐ ప్రదీప్ సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

చిరుత కలకలం



రైతుకు సూచనలిస్తున్న ఫారెస్టు అధికారి

తాడిమర్రి: మండలంలోని కునుకుంట్ల సమీపంలో మంగళవారం చిరుత సంచారం కలకలం సృష్టించింది. ఉదయం 6 గంటల సమయంలో పనులకు వెళుతున్న కూలీలు చిన్నకుంట వద్ద రోడ్డు దాటుతున్న చిరుతను గుర్తించారు. ఫారెస్టు బీట్ ఆఫీసర్ సూర్యనారాయణకు సమాచారం ఇచ్చారు. ఆయన గ్రామానికి చేరుకుని ఆయా ప్రదేశాలను పరిశీలించారు. తోటలో ఆవులు మేపుతున్న రైతు భూమే ఆదినారాయణకు జాగ్రత్తలను వివరించారు. కూలీలు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్‌లో శబ్దాలు చేస్తూ, గట్టిగా మాట్లాడుకుంటూ పనులు చేసుకోవాలని సూచించారు. గట్టిగా కేకలు వేస్తే చిరుత పారిపోతుందన్నారు. మళ్లీ కనిపిస్తే 630487756 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

నేటి నుంచి పాలిసెట్ రెండో దశ కౌన్సెలింగ్

అనంతపురం: పాలిసెట్ రెండో దశ కౌన్సెలింగ్ ప్రక్రియ బుధవారం ప్రారంభం కానుందని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి తెలిపారు. సెప్టెంబర్ ఒకటిలోపు ఫీజు చెల్లింపు, సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. సెప్టెంబర్ 4న సీట్ల కేటాయింపు ఉంటుందని, 7వ తేదీ లోపు ఆయా కళాశాలల్లో రిపోర్టు చేయాలన్నారు.

'చల్లటి' కబురు



బుక్కరాయసముద్రం: వాతావరణ శాస్త్రవేత్తలు చల్లటి కబురు వినిపించారు. భానుడి ధాటికి అల్లాడిపోతున్న ప్రజలు, వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతన్నలకు శుభవార్త తెలిపారు. రానున్న ఐదు రోజుల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాకు వర్ష సూచన ఉందని రేకులకుంటలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త అశోక్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు వారు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తేలికపాటి నుంచి మధ్యస్థ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

పుట్టపర్తి టౌన్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వంద రోజుల పని పూర్తి చేసిన కుటుంబాల్లోని నిరుద్యోగ యువతకు ఉచితంగా కంప్యూటర్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంగ్లిష్ నైపుణ్యాలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ఏపీఎం లక్ష్మీనారాయణ, జాబ్ కో-ఆర్డినేటర్ ఆంజనేయులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ పాస్ లేదా ఏదైనా డిగ్రీ పట్టా పొంది 18 నుంచి 25 సంవత్సరాల వయసు వారు అర్హులన్నారు. సెప్టెంబర్ 3లోపు పుట్టపర్తిలోని ఈశ్వరమ్మ మండల సమాఖ్య కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9640899337లో సంప్రదించాలని కోరారు.

హెచ్చెల్సీకి నీటి పునరుద్ధరణ

అనంతపురం సెంట్రల్: తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి నీటి సరఫరాను పునరుద్ధరించారు. మూడు రోజుల క్రితం కర్ణాటక పరిధిలో 78వ కిలోమీటరు వద్ద హెచ్చెల్సీకి గండి పడిన విషయం విదితమే. అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. కాలువ గట్టు పటిష్టీకరణ పనులు పూర్తవడంతో మంగళవారం తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి నీటిని విడుదల చేశారు. గంటగంటకూ నీటిని పెంచుకుంటూ బుధవారం నాటికి యథావిధిగా 1,500 క్యూసెక్కుల వరకు విడుదల చేస్తారని హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్ తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 78.504 టీఎంసీల నీటి నిల్వ ఉందని వివరించారు. వీలైనంత త్వరగా నీటిని తీసుకొచ్చి ఆయకట్టుకు విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బీ ఫార్మసీ ఫలితాల విడుదల

అనంతపురం: బీ.ఫార్మసీ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్-19) రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలు, బీఫార్మసీ మూడో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్-19) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు జేఎన్‌టీయూ అనంతపురం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ బి.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. పరీక్ష ఫలితాల కోసం జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని వారు సూచించారు.

విధుల్లోకి శ్రీరామరెడ్డి తాగునీటి ప్రాజెక్టు కార్మికులు

కూడేరు: అధికారులు జరిపిన చర్చలు ఫలప్రదమవడంతో శ్రీరామరెడ్డి తాగునీటి ప్రాజెక్టు కార్మికులు సమ్మె వీడి విధుల్లోకి వచ్చారు. కూడేరు మండల పరిధిలోని పీఏబీఆర్ వద్ద ఉన్న శ్రీరామరెడ్డి తాగునీటి ప్రాజెక్టు కింద పనిచేస్తున్న కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 19న సమ్మెబాట పట్టారు. ఆదివారం సాయంత్రం ప్రాజెక్ట్ అధికారులు కార్మికులతో జరిపిన చర్చలు సఫలం కాలేదు. మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎహసాన్ బాషా, ఈఈ జవహర్ కుమార్, సీఐ శేఖర్, కూడేరు, ఉరవకొండ ఎస్‌ఐలు సత్యనారాయణ, వెంకటస్వామిలు ప్రాజెక్ట్ వద్దకు వెళ్లి కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, తాలుకా కార్యదర్శి రామాంజనేయులు, గంగాధర్, కొండారెడ్డి, ఎర్రిస్వామితో మరోమారు చర్చలు జరిపారు. వారంలోపు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలను, నెలలోపు పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ సొమ్ము చెల్లించే బాధ్యత తమదేనని ఎస్‌ఈ, ఈఈ రాతపూర్వకంగా హామీ ఇచ్చారు. ఇందుకు కార్మికులు అంగీకరించి సమ్మె విరమించి విధుల్లోకి చేరారు.



కేరళ సత్యసాయి భక్తుల వాయిద్య కచేరీ





సంగీత కచేరీ నిర్వహిస్తున్న కేరళ యువత

ఓనం.. శోభాయమానం

ప్రశాంతి నిలయం: సాయికుల్వంత్ సభా మందిరంలో ఓనం వేడుకలు మంగళవారం కనులపండువగా జరిగాయి. పర్వదినాన్ని పురస్కరించుకుని కేరళీయులు తమ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ సత్యసాయి మహాసమాధి, సాయికుల్వంత్ సభా మందిరాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఉదయం వేదపఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. కేరళకు చెందిన 14 జిల్లాల సత్యసాయి యూత్ సభ్యులు సంగీత విభావరితో అలరించారు. తమ గాత్రంతో భక్తులను మైమరపించారు. సాయంత్రం విష్ణుదాస్ కలేకులంగర బృందం వాయిద్య కచేరీతో ఆకట్టుకుంది. సత్యసాయితో తమ అనుబంధాన్ని, ఓనం పర్వదిన విశిష్టతను ఈ సందర్భంగా సత్యసాయి ఆధ్యాత్మిక, మహిళా విభాగాల కో ఆర్డినేటర్లు ఆశా రాయ్, ప్రతిక్షాలు వివరించారు. కళాకారులకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్‌రాజు దంపతులు నూతనవస్త్రాలు, జ్ఞాపికలు అందజేశారు.



కేరళ సంప్రదాయాలు ప్రతిబింబించేలా సత్యసాయి చిత్రపటానికి అలంకరణ

క్లుప్తంగా

నేటి నుంచి న్యాయవాదుల విధుల బహిష్కరణ

అనంతపురం: అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లోని అన్ని కోర్టుల్లోనూ బుధవారం నుంచి మూడు రోజుల పాటు న్యాయవాదులు విధులు బహిష్కరిస్తున్నట్లు అనంతపురం బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ కోర్టు స్పెషల్ సెషన్స్ జడ్జి తరచూ విధులకు గైర్హాజరవుతున్నారని, న్యాయవాదులతో వ్యవహరించే తీరు సరిగా లేదని, వెంటనే జడ్జిని బదిలీ చేయాలనే ప్రధానమైన డిమాండ్‌తో విధుల బహిష్కరణకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ కోర్టు స్పెషల్ జడ్జిని బదిలీ చేయాలని పోర్ట్‌ఫోలియో జడ్జికి వినతి పత్రం అందజేశామన్నారు.

మహిమ గల చెంబు వ్యవహారంలో ఇద్దరి అరెస్ట్

తలుపుల: మహిమ గల చెంబు (రైస్ పుల్లింగ్) వ్యవహారంలో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ఎస్ఐ మగ్బూల్‌బాషా వెల్లడించారు. అనంతపురానికి చెందిన రాఘవేంద్ర, అతని డ్రైవర్ లింగమయ్య ఇద్దరూ తమ వద్ద రూ.కోట్ల విలువ చేసే మహిమ గల చెంబు ఉందని, తక్కువ ధరకే దానిని విక్రయిస్తున్నట్లు కొందరిని నమ్మించే యత్నం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ మగ్బూల్‌బాషా అప్రమత్తమై రెక్కమాను క్రాస్‌లో ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించారు. వారి నుంచి జాకెట్, హెల్మెట్, రాగి చెంబు, కారు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పనుల్లో నాణ్యత లోపించరాదు

కూడేరు: మనబడి నాడు–నేడు కింద చేపట్టిన పనుల్లో ఎక్కడే గాని నాణ్యత లోపించరాదని ఇంజినీరింగ్ అధికారులను మనబడి నాడు–నేడు స్టేట్ క్వాలిటీ కంట్రోల్ చీఫ్ బుగ్గయ్య ఆదేశించారు. మంగళవారం కూడేరు మండలం రామచంద్రాపురంలోని ప్రాథమిక పాఠశాల, కమ్మూరు, కొర్రకోడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చేపట్టిన నాడు–నేడు పనులను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్న క్రమంలో పనుల్లో నాణ్యత లోపించరాదని సూచించారు. చేపట్టిన పనులు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ శ్రీనివాసులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బతుకు పూల బాట

- పూల తోటల సాగుపై రైతుల ఆసక్తి
- ఉమ్మడి జిల్లాలో విస్తరిస్తున్న తోటలు
- కనకాంబరాలు మొదలుకొని గులాబీల దాకా పండిస్తున్న వైనం



ఈయన పేరు నరసింహమూర్తి. మడకశిర మండలం కదిరేపల్లి గ్రామం. తనకున్న నాలుగు ఎకరాల్లో ఎనిమిదేళ్ల నుంచి బోరు బావి కింద ముద్ద బంతి పూలు సాగు చేస్తున్నారు. ఎకరాకు రూ. 25 వేల నుంచి రూ. 30 వేల పెట్టుబడి పెట్టారు. కోసిన పూలను హైదరాబాద్, రాజమండ్రి, తుమకూరు మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో కేజీ పూలు రూ.10 ఉంటే ఎకరాకు ఖర్చులు పోనూ రూ. 50 వేలకు పైగా ఆదాయ వస్తోంది. అదే రూ.20 నుంచి రూ. 30 ఉంటే రూ.లక్ష పైగా అందుతోంది.



చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు శ్రీనివాస్. రొళ్ల మండలం. దాసప్ప పాళ్యం గ్రామం. బోరు బావి కింద ఎకరాలో చామంతి పూలు, మరో ఎకరా వక్క తోటలో అంతర పంటగా గులాబీ పూలు సాగు చేశాడు. చామంతి పూల సాగుకు రూ. లక్ష వరకు ఖర్చయింది. గులాబీ సాగుకు రూ.50 వేలు వచ్చింది. ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు బాగా ఉండడంతో చామంతి పూల విక్రయం ద్వారా రూ. రెండు లక్షల నుంచి రెండున్నర లక్షల వరకూ అందింది. గులాబీల ద్వారా రూ.లక్ష నుంచి ఒకటిన్నర లక్ష వరకు పొందారు.



మడకశిర ప్రాంతంలో సాగు చేసిన ముద్దబంతి పూల తోటలు



వక్క తోటలో అంతర పంటగా సాగు చేసిన గులాబీ మొక్కలు

సాక్షి, అనంతపురం డెస్క్: పెళ్లిళ్లు, ఊరేగింపులు, ఉత్సవాలు, సన్మానాలు , సత్కారాలు, స్వాగతాలు ..ఇలా ఏ కార్యక్రమమైనా పూలతో పని ఉంటుంది. అది శుభకార్యమైనా, అశుభకార్యమైనా పూలు తప్పనిసరిగా ఉండాల్సిందే. అందుకే పూలు పండించే రైతులు, పూలమ్ముకునే వ్యాపారులు నష్టపోవడం చాలా అరుదు. ఈ సత్యం తెలిసిన పలువురు రైతులు తమ బతుకులకు 'పూలబాట' వేసుకుంటున్నారు. సంప్రదాయ పంటల సాగును తగ్గించుకుని పూల తోటలపై మొగ్గు చూపుతున్నారు.

విభిన్న రకాల సాగు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒకప్పుడు కనకాంబరాలు, మల్లె, బంతిపూలు వంటి మూడు నాలుగు రకాల పూల తోటలు మాత్రమే సాగయ్యేవి. కానీ ఇప్పుడు విభిన్న రకాలు సాగు చేస్తున్నారు. ప్రజల అభిరుచి, మార్కెట్లో డిమాండ్ను బట్టి అరుదైన రకాలు సైతం పండిస్తున్నారు. చామంతి, కనకాంబరం, మల్లె, బంతిపూలతో పాటు ఆస్టర్, కాగడా, లిల్లీ, గులాబీ, చాందిని, సంపంగి, విర జాజి వంటి పూల తోటలు సాగు చేస్తున్నారు.

1,600 హెక్టార్లకు పైగా తోటలు

ఉమ్మడి జిల్లాలో 1,600 హెక్టార్లకు పైగా పూల తోటలు విస్తరించి ఉన్నాయి. శ్రీ సత్యసాయి జిల్లాలో సుమారు 800 హెక్టార్లు, అనంతపురం జిల్లాలో 800 హెక్టార్లలో పూల తోటలు ఉన్నట్లు ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. ఇందులో 50 శాతానికి పైగా బంతిపూలనే సాగు చేస్తున్నారు. కొందరు రైతులు ప్రధాన పంటగా పూల సాగు చేపడుతుండగా .. మరికొందరు అంతర పంటగా ఎంచుకుంటున్నారు. బొప్పాయి వంటి పండ్ల తోటల్లో కనకాంబరాలను అంతర పంటగా సాగు చేయడం జిల్లాలో ఎప్పటినుంచో ఉంది. అనంతపురం జిల్లాలోని నార్పల, శింగనమల, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, పామిడి, కుందుర్పి, కణేకల్లు, గుంతకల్లు, శ్రీ సత్యసాయి జిల్లాలోని మడకశిర, అగళి, రొళ్ల, అమరాపురం, గుడిబండ, తనకల్లు, నల్లచెరువు, చిలమత్తూరు, లేపాక్షి, హిందూపురం మండలాల్లో పూల తోటల విస్తీర్ణం ఎక్కువగా ఉంది. అగళి మండలం నరసంబూది, మడకశిర మండలం బేగర్లపల్లి వంటి గ్రామాల్లో 80 శాతానికి పైగా రైతులు పూల తోటల సాగు పైనే ఆధారపడ్డారు.

అండగా స్థానిక మార్కెట్లు

ఉమ్మడి జిల్లాలోని కదిరి, బత్తలపల్లి, మడకశిర, సరిహద్దున కర్ణాటకలో ఉన్న శిర, తుమకూరు తదితర ప్రాంతాల్లోని పూల మార్కెట్లు రైతులకు దశాబ్దాలుగా అండగా నిలుస్తున్నాయి. రైతులు ఆయా ప్రాంతాల్లోని వ్యాపారులకు పూలు విక్రయిస్తున్నారు. సీజన్ బట్టి ధరలు కూడా బాగుంటుండడంతో రైతులు స్థానిక మార్కెట్లనే నమ్ముకుంటున్నారు. రైతుల నుంచి పూలు కొంటున్న వ్యాపారులు వాటిని చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలకు ఎగుమతి చేస్తున్నారు. స్థానిక అవసరాలకూ విక్రయిస్తున్నారు.

ఏడాది పొడవునా దిగుబడి



రెండెకరాల పొలంలో రెండేళ్ల క్రితం సుమారు 50 వేలు పెట్టుబడి పెట్టి లిల్లీ పూలు సాగు చేశా. రెండేళ్లుగా దిగుబడి వస్తోంది. పంట బాగుంటే ఎకరంలోనే 60–70 కిలోల పూలు లభిస్తున్నాయి. కర్ణాటక రాష్ట్రం బళ్లారి మార్కెట్‌కు వాటిని తరలిస్తున్నా. ఏడాది పొడవునా దిగుబడి వస్తుంది.

– వెంకట నారాయణరెడ్డి, బోరంపల్లి గ్రామం, కళ్యాణదుర్గం మండలం

మంచి లాభాలు



నాలుగు నెలల క్రితం ఒకటిన్నర ఎకరం పొలంలో రూ.30 వేలు పెట్టుబడి పెట్టి లిల్లీపూలు సాదుచేశా. ఇప్పుడిప్పుడే మొగ్గలు వేస్తున్నాయి. పూలను కర్ణాటక రాష్ట్రం పావగడ మార్కెట్‌కు పంపిస్తా. పంట మూడేళ్లు ఉంటుంది. లిల్లీ పూల సాగులో పెట్టుబడి తక్కువ. దిగుబడి ఎక్కువ. దీంతో మంచి లాభాలు వస్తాయి.

– మారుతి, రైతు, అచ్చంపల్లి, కంబదూరు మండలం

లాభదాయక పంట చామంతి



దాదాపు 10 ఏళ్ల నుంచి చామంతి సాగు చేస్తున్నా. మదనపల్లె సమీపంలోని వాయల్పాడు, లేదంటే, తమిళనాడులోని రాయకోటి వద్ద ఒక్కొక్కటి రూపాయి చొప్పున దాదాపు 8 నుంచి నుంచి 10 వేల మొక్కలు తీసుకొచ్చి నాటుతున్నా. ఎకరానికి రూ.50 వేల మేర ఖర్చవుతుంది. నాలుగు నెలలకు పూలు కోతకు వస్తాయి. దాదాపు 5 టన్నుల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం పూలు మార్కెట్‌లో కేజీ రూ. 150 పలుకుతున్నాయి. ఈ లెక్కన బాగానే గిట్టుబాటవుతోంది.

– తలారి ప్రసాద్, చామంతి రైతు, నార్పల

పూల సాగుకు నేలలు అనుకూలం



పూల సాగుతో రైతులకు లాభాలు ఉన్నాయి. ప్రభుత్వం ఒక సీజన్‌కు హెక్టారులో సాగు చేసిన పూల తోటలకు రూ.16 వేల ప్రకారం సబ్సిడీ అందజేస్తోంది. దీంతో పాటు సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందజేస్తున్నారు. మార్కెటింగ్‌కు జిల్లా అనుకూలంగా ఉంది. బెంగళూరు మార్కెట్‌కు తరలించి లాభాలు ఆర్జించవచ్చు. జిల్లాలోని అన్ని ప్రాంతాలు పూల సాగుకు అనుకూలమైనవి.

– చంద్రశేఖర్, ఉద్యానశాఖ అధికారి, శ్రీసత్యసాయి జిల్లా

సుపరిపాలనలో కార్యదర్శులదే కీలక పాత్ర

ప్రశాంతి నిలయం: ప్రజలకు సుపరిపాలన అందించడంలో పంచాయతీ కార్యదర్శులదే కీలక పాత్ర అని కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. స్థానిక సంస్కృతీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో పంచాయతీ కార్యదర్శులకు 6 రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్ బాబు మాట్లాడుతూ శిక్షణలో ప్రతి అంశంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్రజలకు నాణ్య మైన సేవలు అందించాలన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా నాణ్యమైన సేవలు అందుతున్నాయన్నారు. మాన్యువల్, రూల్ పుస్తకాలను క్షుణ్ణంగా చదవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి విజయ్ కుమార్, ఆర్‌డీఓ భాగ్యరేఖ, సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి, డీఎల్‌పీఓలు శివకుమారి, శివనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఈ-క్రాప్' పక్కాగా ఉండాలి

పుట్టపర్తి అర్బన్: ఈ క్రాప్ నమోదు ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం కిసాన్ సమ్మాన్ నిధి వెబ్‌సైట్‌లో నమోదు చేసుకున్న రైతుల ఆధార్ సీడింగ్ కానట్టయితే వీఆర్‌ఓల ద్వారా నమోదు చేయించాలన్నారు. మ్యుటేషన్ చేయడానికి సీసీఎల్‌ఏ వెబ్‌సైట్‌లో ప్రత్యేక అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. బ్యాంకు అకౌంట్‌తో ఆధార్ అనుసంధానం చేసే ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. అమడగూరు, అగళి, మడకశిర, ఓడీచెరువు, పెనుకొండ, రొద్దం, కదిరి, నల్లమాడ, చిలమత్తూరు మండలాలు చాలా వెనుకబడి ఉన్నాయని, పురోగతి సాధించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏలు, మండల వ్యవసాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



మృతుడు గిరీష్

హిందూపురం అర్బన్: మండలంలోని దేవరపల్లికి చెందిన గిరీష్‌కుమార్ (25) మంగళవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కొంత కాలం క్రితం కర్ణాటకలో ఓ మైనర్ బాలికను వివాహం చేసుకున్న కేసులో ఆయన జైలుకు వెళ్లాడు. ఆ తర్వాత బెయిల్‌పై విడుదలయ్యాడు. బుధవారం అదే కేసుపై కోర్టులో విచారణ ఉండడంతో శిక్ష పడుతుందని భావించి గుళికల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న గిరీష్‌ను కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించేలోపు మృతిచెందాడు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

FREE EDUCATION

■ ఇంటర్ పాస్ అయిన స్టూడెంట్స్ కి B.Sc (నర్సింగ్) B.Sc. (MLT), BPT (ఫిజియోథెరపీ) GNM (నర్సింగ్), DMLT (బ్లడ్ టెస్ట్) ఫ్రీ ఎడ్యుకేషన్, కాలేజీలో హాస్టల్ కలదు. సంప్ర : జి. మురళి. సెల్ : 9030661651, ATP. [A-2714]

DMLT ADMISSIONS

■ DMLT 2 సం॥ల కోర్స్ మేనేజ్‌మెంట్ సీట్లు కొరకు అడ్మిషన్లు జరుగుచున్నవి. కొన్ని సీట్లు మాత్రమే కలవు. Q : ఇంటర్ పాస్, # SEEDS కాలేజ్, ATP. 9440255034, 8897761840 [A-776847]

POLTECHNIC ADMISSIONS

■ పాలీసెట్ సెకెండ్ కౌన్సిలింగ్ (30th ఆగస్ట్ నుండి) పాలిటెక్నిక్ అడ్మిషన్స్ కలవు. ఫ్రీ ఎడ్యుకేషన్. ఫ్రీ హాస్టల్. సంప్ర : జి. మురళి, 9030661651, ATP. [A-2715]

PARAMEDICAL

■ B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-2045]

ఉచిత శిక్షణతో కూడిన ఉపాధి

■ గ్రామీణ నిరుద్యోగ యువతకు నాలుగు నెలల కాల వ్యవధిలో కంప్యూటర్ హార్డ్‌వేర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సులలో ఉచిత వసతి తో కూడిన శిక్షణ సదుపాయం, అర్హతను బట్టి ఉపాధి అవకాశాలు. Nihar skill Education, Kadapa. సంప్ర: 9063082227. [C-1220224]

REAL ESTATE

LEASE/ RENT

■ 12000Sft Commercial Hospital Building for Rent in Eluru, Near Old Bus Stand, Contact Cell: 9848112379. [T-2031]

SERVICES

BUSINESS OFFER

■ Sipra కంపెనీ ప్రొవైడ్ అన్ని రకముల బిజినెస్ ప్రాపర్టీ ప్రాజెక్టు కొరకు LAP & Agent's కావలెను. మంచి జీతం+కమీషన్. Cell: 9990752820. [T-1225444]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221531]

SERVICES

■ అతి తక్కువ వడ్డీతో ఇల్లు, వ్యక్తిగత, టేక్ ఓవర్, మార్టిగేజ్ కలవు. CIBIL స్కోర్ తక్కువ ఉన్నా సూచనలు ఇవ్వబడును. ఏజెంట్లు కావలెను. ఫోన్ :9041115088 [HA-30327]

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647 [V- 6913]

WANTED

■ WANTED SALES EXECUTIVE DP WHITE PAINTS: Location: Anantapur District, Qua : Inter, Degree, MBA, Cont: 9704200943, 85558 93996. [A-2713]

■ మా ఆఫీసులో వర్క్ చేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. Q : 10th, జీతం : 7,000 to 10,000 + ఇన్సెంటివ్స్ కలవు. సెల్ : 9133223529, 9666983886 [A-776850]

■ హరేకృష్ణ హోంకేర్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/కావలెను. ఫ్రీ వసతి+భోజనం.జీ:18K. హైదరాబాద్ ఫోన్: 9640258899, విజయవాడ:9640648899 [H-189325]

■ అనంతపురం నందు HP గ్యాస్ లారీలు నడుపుటకు HMV లైసెన్స్ కలిగిన హజార్డస్ డ్రైవర్లు కావలెను. నెలకు 20 వేల–30 వేల పైన (జీతం+ బత్త) 95151 51065, 77807 15154 [L-798760]

■ జాబ్ గ్యారంటీ 18–50సం॥ల మహిళలు, పురుషులు అర్జెంటుగా కావలెను. ఫ్రీ రూం+ భోజనం, జీతం: 25000/–వేల వరకు. ఫోన్ : 8886733008 / 005 [HA-10956]

■ ప్రముఖుల ఇళ్ళ వద్దనే వుండి వృద్ధులను, బెడ్ పేషెంట్స్‌ను చూసుకొనుటకు M/F కేర్ టేకర్స్, ఆయాలు, నర్సులు కావలెను. జీతం 14-20K, వసతి +భోజనం VJA ✆ 91608 35559,78158 35561 [B-330]

■ వివిధ శాఖలలో కాంట్రాక్ట్ & ఔట్ సోర్సింగ్ జాబ్స్ కం॥ ఆపరేటర్స్, క్లర్క్స్, అటెండర్స్, జూ॥ అసిస్టెంట్స్, రికార్డ్ అసిస్టెంట్స్, ఆఫీసు అసిస్టెంట్స్ అ: 10th-PG, ఆకర్షణీయమైన జీతం. 9492881006 [G-7557]

■ హాస్టల్ ఇన్‌ఛార్జీలు, క్లాసు ఇన్‌ఛార్జీలుగా వర్క్ చేయుటకు పురుషులు కావలెను. జీతం: 10000/– నుంచి 18000/– వరకు ఇవ్వబడును. మరియు ఉచిత భోజనము వసతి కల్పించబడును. విద్యార్హతలు: ఇంటర్, డిగ్రీ, వయస్సు 23+, పనిచేయు స్థలము: గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజీ. సంప్ర: 92487 33371 [G-4601]

■ వివేకానంద షూమార్ట్‌లో పనిచేయుటకు (స్త్రీ/పు) అనుభవం గల వర్కర్స్ అర్జెంటుగా కావలెను. ఆకర్షణీయమైన జీతం. సంప్ర॥ Opp. S.V. థియేటర్, ఓల్డ్ టౌన్, ATP. సెల్: 8919949649. [A-2660]

■ WANTED FEMALE CANDIDATES to work in Medical Stores at Anantapur. Qua: B.Sc / B.Pharm Contact:9701315637. [A-1125]

■ WANTED FOOD SERVICE BOYS / GIRLS, House Keeping & Assistant Chef's at KIMS-SAVEERA Hospital Canteen, ATP. Ph : 6300376535 [A-1115]

■ శ్రీ కృష్ణ సెక్యూరిటీ ఏజెన్సీ నందు కూడేరు మండల పరిధి లో సెక్యూరిటీ గార్డ్ ఉద్యోగ అవకాశం వయస్సు 22 to 40 సం. Q : 10th, హైట్ 5.6.. సెల్: 6304890641, అనంతపురం. [A-776857]

■ WANTED Marketing and Sales Executives. Good Communication Skills and atleast 1 year of work experience in the Real Estate Field. Cont : 9000677088, 7207115307. [A-2663]

■ ప్రముఖ S-3 గ్రూప్ కంపెనీలో టీమ్ లీడర్స్ మరియు టెలికాలర్స్‌గా పనిచేయుటకు బాగా చదువుకున్న మరియు ఔత్సాహవంతమైన మహిళా అభ్యర్థులు వెంటనే కావలెను. జీతం : 20,000/– విద్యార్హత : Post Graduation. సెల్ : 9490863207 [A-776851]

■ నోబుల్ హెల్త్‌కేర్ సర్వీసెస్ అనంతపురము నందు వృద్ధులు, బెడ్ రిడెన్ పేషెంట్స్ పక్షవాతం పేషెంట్స్, బేబీ కేర్, కేర్ టేకర్స్ 24 గంటలు పనిచేయుటకు ఓర్పుగల ఆయాలు, నర్సులు ఆడ మరియు మగ కావలెను. వారికి ఆకర్షణీయమైన జీతం మరియు ఉచిత భోజనము వసతి సదుపాయం కలదు. వివరాలకు సంప్రదించవలసిన నెంబర్లు 9441018078, 6301341831. [A-7302]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లైయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అనుబంధాలకు ప్రతీక 'రాఖీ'

- మార్కెట్‌లో రకరకాల రాఖీల సందడి



పుట్టపర్తి సూపర్ బజారులో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన రాఖీలు

పుట్టపర్తి టౌన్: అన్నాచెల్లెళ్లు.. అక్కాతమ్ముళ్ల బంధానికి ప్రతీక నిలిచిన రాఖీ పండుగ రానేవచ్చింది. కులమతాలకు అతీతంగా అందరూ బుధవారం రాఖీ పౌర్ణమిని ఘనంగా నిర్వహించుకునేందుకు జిల్లా వాసులు సిద్ధమయ్యారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో, పట్టణాల్లో సందడి నెలకొంది. మార్కెట్లలో వివిధ రకాల రాఖీల విక్రయాలూ ఊపందుకున్నాయి.

మానవ సంబంధాలు మెరుగుకు దోహదం

రాఖీ పండుగను తమ అనుబంధాలకు ప్రతీకగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఏటా శ్రావణ పౌర్ణమి నాడు జరుపుకునే ఈ పండుగ మానవ విలువలకు అద్దం పడుతోంది. రక్తం పంచుకుని పుట్టిన సోదరసోదరీమణుల మాత్రమే ఈ పండుగ జరుపుకోవాలని లేదు. ఎలాంటి రక్తసంబంధం లేకున్నా.. సోదర భావంతో మెలుగుతున్న ప్రతి ఒక్కరికీ కులమతాలకు అతీతంగా రాఖీలు కట్టి సోదరీమణులు తమ అనుబంధాన్ని చాటిచెబుతుంటారు.

నాణ్యతను బట్టి ధర

ప్రస్తుతం మార్కెట్‌లో వివిధ రకాలు హల్‌చల్ చేస్తున్నాయి. హైదారాబాద్, సూరత్, ముంబయి, నాగపూర్, పూణే, కలకత్తా తదితర ప్రాంతాల నుంచి రాఖీలను దిగుమతి చేసుకున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. వీటి నాణ్యతను బట్టి రూ.10 నుంచి రూ.వేల వరకు ధర పలుకుతున్నాయి. రాఖీల్లో బ్రాస్‌లైట్లు, లాకెట్లకు ఎక్కువ డిమాండ్ ఉండడంతో వాటి ధర కూడా ఎక్కువగానే ఉంటోంది. సుదూర ప్రాంతాల్లో ఉన్న తమ సోదరులకు రాఖీలను కొరియర్ ద్వారా సోదరీమణులు పంపించారు. ఛోటాభీమ్, డోరేమాన్, సూపర్‌మ్యాన్ తదితర రాఖీలు చిన్నారులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కాగా, ఈ ఏడాది రాఖీలు ఆన్‌లైన్‌నూ అందుబాటులో వచ్చాయి. ధరలు సైతం అందుబాటులో ఉండడంతో చాలా మంది ఆన్‌లైన్ ద్వారా ఇప్పటికే రాఖీలు తెప్పించుకున్నారు.

పట్టు రాయితీలను సద్వినియోగం చేసుకోండి

తనకల్లు: ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని పట్టు రైతులకు పట్టు పరిశ్రమశాఖ జాయింట్ డైరెక్టర్ పద్మమ్మ సూచించారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్ పట్టుబడి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇతర పంటలతో పోల్చుకుంటే మల్బరీ సాగు లాభదాయకంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం కూడా మల్బరీ సాగుకు ప్రోత్సాహకాలను అందజేస్తోందన్నారు. రేరింగ్ షెడ్ నిర్మాణానికి ఎస్టీ, ఎస్సీలకు 90 శాతం, ఓసీ రైతులకు 75 శాతం రాయితీ ఉంటుందన్నారు. పట్టు సాగులో మెలకువలు, పట్టు పురుగుల పెంపకంలో జాగ్రత్తలను వివరించారు. అనంతరం మల్బరీ పంటకు ఆశించే తెగుళ్లు, వాటి నివారణ పద్ధతులపై శాస్త్రవేత్త డాక్టర్ వెంకటచలపతి అవగాహన కల్పించారు. . కార్యక్రమంలో పట్టు పరిశ్రమ శాఖ ఏడీ గీత, సెరికల్చర్ అధికారి మస్తాన్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొండా మల్లికార్జున, టీఏ అంజినప్ప, వీఎస్ఏలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

పక్కాగా తుది ఓటరు జాబితా



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ చేతన్

హిందూపురం టౌన్: ఎలాంటి లోపాలకు ఆస్కారం లేని ఆరోగ్యకరమైన, పటిష్టమైన తుది ఓటరు జాబితాను రూపొందిస్తామని నియోజకవర్గ ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ చేతన్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. అక్టోబర్ 17న సమగ్ర ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురిస్తామన్నారు. అక్టోబర్ 17 నుంచి నవంబర్ 30 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. జనవరి 5, 2024న తుది ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం


- ఐదు పాఠశాలలకు ప్రతిభా పురస్కారాలు



స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డు అందుకుంటున్న కనగానపల్లి ఏపీఎంఎస్ ఉపాధ్యాయుడు

పుట్టపర్తి అర్బన్: సుప్రసిద్ధ భారత హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి కలెక్టర్ అరుణ్‌బాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచఖ్యాతి గాంచిన ఇద్దరు మహోన్నతుల జయంతిని జరుపుకుంటున్న ఈ రోజు ఎంతో ప్రత్యేకతను సంతరించుకున్నదన్నారు. వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి, క్రీడా చరిత్రలో భారతదేశ కీర్తిని ప్రపంచ దేశాల్లో రెపరెపలాడించిన మేజర్ ధ్యాన్‌చంద్ సేవలను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రపంచ స్థాయిలో హాకీ క్రీడకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందంటే అందుకు ధ్యాన్‌చందే కారణమన్నారు. ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం 2022–23 విద్యాసంవత్సరానికి గాను క్రీడల్లో అత్యధిక పతకాలు సాధించిన విద్యార్థులున్న ఐదు పాఠశాలలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఇందులో వరుసగా కనగానపల్లి ఏపీ మోడల్ స్కూల్, కొడిగెనహళ్లి ఏపీఆర్ఎస్‌ఈ, పరిగి జెడ్పీహెచ్ఎస్, పులమతి జెడ్పీహెచ్ఎస్, హిందూపురం ఎంజీఎం హైస్కూల్ ఉన్నాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చేతన్, సబ్ కలెక్టర్ కార్తీక్, డీఆర్ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, జిల్లా చీఫ్ కోచ్ ఉదయ్‌భాస్కర్, డీఈఓ మీనాక్షి, డీపీఓ విజయ్‌కుమార్, పర్యాటకశాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

- **ధ్యాన్ చంద్‌కు నివాళి**



స్పోర్ట్స్ డే ఆకారంలో కూర్చొన్న విద్యార్థులు

హిందూపురం టౌన్: జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్‌కు హిందూపురంలోని పాంచజన్య పాఠశాల విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం తెలుగు భాషా దినోత్సవంతో పాటు ధ్యాన్‌చంద్ జయంతిని పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల విద్యార్థులు స్పోర్ట్స్ డే అక్షరాకృతిలో కూర్చొని ధ్యాన్ చంద్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో పాంచజన్య పాఠశాల అధ్యక్షుడు పాంచజన్య శ్రీనివాసులు, కరస్పాండెంట్ నందకుమార్, హెచ్ఎం గాయత్రి, ఏఓ భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, ఏహెచ్ఎంలు శశికళ, అబ్దుల్ రజాక్, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోడౌన్లలో నిల్వతోనే పంటలకు భద్రత

- ఐసీఎం ప్రోగ్రాం డైరెక్టర్ శ్యామ్‌కుమార్



మాట్లాడుతున్న శ్యామ్‌కుమార్



సదస్సుకు హాజరైన రైతులు

హిందూపురం అర్బన్: రైతులు పండించిన పంటల ఉత్పత్తులను ప్రభుత్వ పరంగా నిర్మించిన గోడౌన్లలో నిల్వ ఉంచుకోవడం ద్వారా ప్రయోజనాలతో పాటు భద్రత ఉంటుందని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కో ఆపరేటివ్ మేనేజింగ్ (ఐసీఎం) ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ శ్యామ్‌కుమార్ అన్నారు. మంగళవారం హిందూపురంలోని వెలుగు కార్యాలయంలో కిరికెర సహకార సంఘం అధ్యక్షుడు రంగనాథ్ అధ్యక్షతన జరిగిన రైతుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకునే సమయంలో గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం.. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని గోదాములను ఏర్పాటు చేసిందన్నారు. రైతులు తమ పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర వచ్చేవరకూ ఈ గోదాముల్లో భద్రపరుచుకోవచ్చునన్నారు. ఒకవేళ డబ్బు అత్యవసరమనుకుంటే గోదాముల్లో రైతు నిల్వ ఉంచిన సరుకుపై 80 శాతం సొమ్మును బ్యాంకుల ద్వారా రుణం అందజేస్తారన్నారు. ఇందుకు అధికారులు సహకరిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. కార్యక్రమంలో జిల్లా సహకార సంఘం కోఆపరేటివ్ ఆఫీసర్ సి.సి రామచంద్రయ్య, సబ్ డివిజనల్ అధికారి వన్నుస్వామి, కిరికెర సహకార సంఘం అధికారి రామకృష్ణారెడ్డి, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.